# గాలివాన



**శంకరమంచి పార్థసారధి**

గజపతిరావుగారు కిటికీ వద్ద నిల్చున్నారు. ఆయన దృష్టి దూరంగా కనిపిస్తున్న మట్టి రోడ్డుపై ఉంది. రాత్రంతా కుండపోతగా వర్షంకురిసింది. వానతగ్గినా ఆ ఛాయలు పూర్తిగా పోలేదు. నల్లటి మేఘాలతో నిండిన ఆకాశం, రివ్వున వీస్తున్న చల్లగాలి, వానరాకని హెచ్చరిస్తున్నట్లున్నాయి. వాననీటితో తడిసిన మట్టిరోడ్లు చితచితలాడుతున్నాయి.

ఆయనదృష్టిని రోడ్డుపైనుంచి తప్పించి గదిలోకి చూశారు. అంతా నిశ్శబ్దం—భరించలేని శాపంలాంటి నిశ్శబ్దం అదినాలుగుగదుల ఇల్లు. కానీ ఆ నాలుగ్గదుల్లో నివసించేది ఆయనొక్కడే. అందువల్లే ఇల్లంతా భోరుమంటూ భయపెడుతోంది. అక్కణ్ణించి కదిలి గది మధ్యగా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

గజపతిరావుగారు ఆరడుగుల మనిషి ఆయన్నిచూసినవాళ్ళకి ధైర్యం కలిగించేలా ఉంటారు. ఇలాంటి తండ్రో, అన్నయ్యో ఉంటే బాగుండుననిపించేలా ఉంటారు. అంతటి పులిలాంటి మనిషి ఆరోజు రోగిష్టివాడిలా, నీరసంగా, నిస్సత్తువగా, అలసటగా ఉన్నారు. నిజానికి ఆయనకున్నది ఒక్కటే జబ్బు, మందుల్లేని జబ్బు ఒంటరి తనం జీవితపు రహదారి వెంట తోడులేని పయాణం.

ఆయనకు ఆలోచించేందుకు, కలతపడేందుకు ఇంకే సమస్యలంటూ లేవు.

ఆడపిల్లలిద్దరికీ మంచి సంబంధాలు చూసి ఘనంగానే పెళ్ళిళ్ళు చేశారు. వాళ్ళిద్దరు హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు. వాళ్ళెంతహాయిగా సంతోషంగా